క్లుప్తంగా

పంటనష్ట పరిహారం అందించాలని వినతి

రామడుగు: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణం పరిహారం అందించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో బీజేపీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, భాస్కరాచారి, లక్ష్మీకాంతారెడ్డి, చంద్రమోహన్ చారి, వెంకటేశ్ పలువురు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వండి

సైదాపూర్: బంగారు తెలంగాణలో రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్, డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా ఒక్క పేదవాడికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని, కార్డులో పేర్లు నమోదు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రేషన్ కార్డు ఇవ్వలేని ప్రభుత్వం, అభివృద్ధి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కూరగాయల ధరలను నియంత్రించాలి

జమ్మికుంట: కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ధరలను నియంత్రించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పూదరి శివకుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. అన్ని కూరగాయలు రూ.వందకు తక్కువగా లేవని పేద, మధ్యతరగతి ప్రజలు జీవించడం కష్టంగా ఉందని, రేట్ల తగ్గింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

నియామకం



రామడుగు: మండలంలోని రుద్రారం గ్రామ తెలంగాణ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా నా గంమోహన్‌ను సోమవారం నియామకమయ్యారు. ఈ మేరకు చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడిగా జట్టుపల్లి అనిల్, రామడుగు మండల అధ్యక్షుడు పర్లపల్లి అనిల్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న పీఈటీలు

జమ్మికుంట: క్రీడా పాఠశాలలో ప్రవేశానికి కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన దూడపాక శ్రీవర్షిణి(4వ తరగతి) ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయి సెలక్షన్ కోసం సాధన చేయాలని పీఈటీలు సూచించారు. సోమవారం ఎంఈవో శ్రీనివాస్, పీఈటీలు నర్సయ్య, శ్రీనివాస్, రాజశేఖర్, సుమలత వర్షిణిని అభినందించారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నాయకులు

హుజూరాబాద్: మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ నాయకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. న్యాయమైన హామీలను పరిష్కరించాలని కోరుతూ జూలై 12న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమానికి హాజరవుతున్నామని వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎండీ అజ్జు, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఉపాధ్యక్షురాలు సరోజన, సమ్మక్క, రాజమౌళి, క్రాంతి కుమార్, సహాయ కార్యదర్శి జల్లా రాజేశ్, కోశాధికారి రొంటాల రాజేశ్వరి, ప్రచార కార్యదర్శి బొరగాల రాజ్ కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి వావిలాల చిరంజీవి, కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ మృతి



శంకరపట్నం: మాజీ జెడ్పీటీసీ జాలి జనార్దన్ రెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. మండలంలోని కన్నాపూర్‌కు చెందిన జనార్దన్‌రెడ్డి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మొలంగూర్ సహకార సంఘం చైర్మన్‌గా పనిచేశారు. దివంగత మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా పేరు. జనార్దన్‌రెడ్డికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపట్ల స్థానిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మొక్కలు ఎక్కడ నాటాలి..?

- గ్రామాల్లో స్థలాలు కరువు
- అనువుగా లేని స్థలాల గుర్తింపు
- ఉపాధిహామీ సిబ్బందికి టార్గెట్
- లక్ష్యం చేరుకునేదెలా..?



మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలు

మానకొండూర్: హరితహారంలో మొక్కలు నాటేందుకు గ్రామాల్లో స్థలాలు కరువయ్యాయి, 90 శాతం వరకూ ఖాళీ స్థలాల్లో కొన్నేళ్లుగా మొక్కలు నాటుతున్నారు. గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో ఇప్పటికే ఏడు విడతలుగా వివిధ రకాల మొక్కలు నాటించారు. ఈ ఏడాది మాత్రం మొక్కలు అందుబాటులో ఉన్నా నాటేందుకు స్థలం కొరత ఏర్పడింది. ఈ ఏడాది ప్రతి గ్రామంలో పదివేల మొక్కలు నాటాలనేది అధికారుల టార్గెట్. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉపాధిహామీ క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెంచడంతో సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నాటేందుకు స్థలాలు అంతంతే..

హరితహారంలో మొక్కల పెంపకానికి గ్రామాల్లో ఖాళీ స్థలాలు అంతంత మాత్రమే ఉన్నాయి. అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ స్థలాలు, గుట్టలు, చెరువుగట్లు, ఇళ్ల స్థలాల్లో, లక్షలాది మొక్కలను గత ఏడు విడతల్లో నాటించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామాల్లో ఎక్కడ కూడా ఖాళీ స్థలాలు లేకుండా పోయాయి. ఎక్కడో ఓ మూలన అవి అనువుగా లేని చోట కొంతమేర స్థలాలు ఉండగా వాటిని గుర్తిస్తున్నారు. ప్రతి గ్రామంలో పదివేల మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా, కేవలం మూడు నాలుగు వేల మొక్కలు నాటే అవకాశం ఉందని క్షేత్రస్థాయి సిబ్బంది వాపోతున్నారు.

ఇప్పుడిప్పుడే గుంతల తవ్వకాలు

ఈ ఏడాది హరితహారంలో మొక్కలు నాటడం ఆలస్యమవుతుంది. వర్షాలు ఆలస్యంగా కురువడం, స్థలాల ఎంపికలో ఇబ్బందులు కారణంగా తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే గ్రామాల్లో స్థలాల ఎంపిక జరుగుతుంది. మండల వ్యాప్తంగా 67 వేల గుంతలు తీసినట్లు అధికారులు చెబుతుండగా ఇప్పుడిప్పుడే మొక్కలు నాటుతున్నారు. స్థలాలు లేకపోవడంతో అనువుగా లేని స్థలాలు కూడా ఎంపిక చేస్తున్నట్లు సమాచారం. టార్గెట్ పూర్తి చేసేందుకు రైతుల పంట పొలాల్లో ఆయిల్ ఫాం, మలబార్, పండ్ల మొక్కలు పెంచే దిశగా క్షేత్ర స్థాయి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నా రైతులు అనాసక్తి చూపెడుతుండటంతో ఉపాధిహామీ సిబ్బందికి స్థలాల ఎంపికలో ఇబ్బందులు తప్పడం లేదు.

స్థలాలు ఉన్నా..బౌండరీ ఫిక్స్‌కు వెనుకంజ

గ్రామాల్లో కొంత మేర మొక్కలు నాటేందుకు స్థలాలు ఉన్నా వాటికి జోలికి వెళ్లడం లేదని క్షేత్ర స్థాయి సిబ్బంది వాపోతున్నారు. ప్రధానంగా గ్రామాల్లో సాగునీరు అందించేందుకు కాలువలు నిర్మించారు. వాటి వెంట లక్షలాది మొక్కలు పెట్టొచ్చు. కానీ సంబంధిత అధికారులు వాటికి బౌండరీలు చూపెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములదీ ఇదే పరిస్థితి. ఎల్‌ఎండీ నుంచి ఎస్సారెస్పీ కాకతీయ కాలువ తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్ మీదుగా వెళ్తుంది. దీని వెంట లక్షలాది మొక్కలు నాటే అవకాశం ఉన్నాబౌండరీలు ఏర్పాటు చేయడం లేదు. పైగా రైతులు ఈ ఎస్సారెస్పీ స్థలం మాదని, సాగు చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు.

సెప్టెంబర్ వరకూ నాటుతాం



వర్షాలు ఆలస్యంగా పడటంతో మొక్కలు నాటడం ఆలస్యం అవుతుంది. కాలువల గట్టు వెంట మొక్కలు నాటుదామంటే రైతులు ఆ భూమని సాగు చేసుకుంటామని మొక్కలు నాటనివ్వడం లేదు. ఇప్పుడిప్పుడే గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం జరుగుతోంది. సెప్టెంబర్ వరకూ కార్యక్రమం కొనసాగుతుంది.

–ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



శంకరపట్నం: కేశవపట్నంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న శ్రీనివాస్



ఇల్లందకుంటలో కొప్పుల శంకర్

ఇల్లందకుంట: జీపీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, బాబు, సంపత్, రామంచ రాజేందర్, కొత్తూరి కుమార్, పోడేడి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: గ్రామ పంచాయతీ కార్మికులను పట్టించుకోడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని పీసీసీ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో ఐదోరోజుకు చేరింది. గ్రామాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పరిశుభ్రత లోపించి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చూపడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవతీసుకోవడంలేదని ఆరోపించారు. కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సదానందం, ఇషామొద్దీన్, తిరుపతి, తిరుపతిరావు, సంపత్,సదానందం, తదితరులు పాల్గొన్నారు.

చెరువు మత్తడి వద్ద ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: మండలంలోని బూర్గుపల్లి చెరువు మత్తడి వద్ద సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమీప పొలంలో కూలీలతో నాటు వేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదకాలువ నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం నీటిని తరలిస్తుండగా బూర్గుపల్లి సమీపంలోని వరదకాలువ తూము ద్వారా చెరువును నింపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షాల జాప్యం కారణంగా ఎస్సారెస్పీలోకి రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని మళ్లిస్తున్న సీఎం కేసీఆర్ అపర భగీరథుడని అన్నారు. ప్రాజెక్టులు, చెరువులను నింపుకొని పంటలు పండించుకోవడమే లక్ష్యంగా ప్రాజెక్టుల రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

బైక్‌లో నుంచి కిందపడిన నాగుపాము



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, కన్నాపూర్ గ్రామాలకు చెందిన తిరుపతి, సాగర్ సోమవారం ద్విచక్ర వాహనంపై పోలీస్ స్టేషన్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి శివారులోకి రాగానే బైక్‌లో నుంచి పాము కరీంనగర్ –వరంగల్ జాతీయ రహదారిపై పడింది. దీంతో ఇద్దరు భయాందోళనకు గురయ్యారు. రోడుపై పడిన పాము పడగ విప్పడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు, వీడియోలు తీశారు.

విద్యార్థులు ఎక్కువ టీచర్లు తక్కువ



టీచర్ లేక ఖాళీగా కూర్చున విద్యార్థులు



మరో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మొత్తం 93 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఒక హెచ్‌ఎంతోపాటు నలుగురు టీచర్లు ఉండాలి. కానీ ఇద్దరు మాత్రమే ఉండటంతో మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ, రికార్డులు ఇతరాత్ర పనులతో ఒక టీచర్ బిజీగా ఉండగా, మరో టీచర్ విద్యా బోధన చేయాల్సి వస్తుంది. ఇద్దరు టీచర్లు రెండు క్లాస్‌ల్లో చదువులు చెబితే మిగితా మూడు క్లాసుల్లో విద్యార్థులు ఖాళీగా ఉంటున్నారు. ఇద్దరు టీచర్లు ఐదు తరగతులకు 20 సబ్జెక్టులు బోధించాల్సిన పరిస్థితి ఉందని హెచ్‌ఎం రాజేశ్వరీ వాపోయారు. కనీసం మరో ఇద్దరు ఉపాధ్యాయులు అవసరమని అన్నారు.

‘ఉపాధి’ పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

చొప్పదండి: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య కోరారు. మండలంలోని కొలిమికుంటలో సోమవారం వివిధ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర లైజన్ అధికారి విజయ రావుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెంట ఎంపీవో రాజగోపాల్ రెడ్డి, సర్పంచ్ సుజాత, రమేశ్, వేణు, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణంపై కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ పంచాయతీ భవనం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశంలో నిర్మించాలని కోరుతూ పంచాయతీ పాలకవర్గం సభ్యులు ప్రజావాణిలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానం పొందకుండానే పాత భవనం వద్ద సర్పంచ్ పనులు ప్రారంభించారని వివరించారు. చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్, రామడుగు ఎంపీడీవో భాస్కర్‌రావుకు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కల్యాణి, కవిత, శ్యామల, శంకర్, మల్లేశం, వెంకటేష్, తిరుపతి, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు దాసరి రాజేందర్ రెడ్డి, జాతీయ యువజన అవార్డు గ్రహీత విష్ణు, నాయకులు మల్లేశం, పూడురి మల్లేశం, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, కమలాకర్, రాజు, గంగారాం, బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీ, పదోన్నతులు చేపట్టాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు చేపట్టాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డీటీఎఫ్ మండల కమిటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలోని చిన్నికోమటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈసందర్భంగా రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి మధ్యంతర భృతి 40శాతం ప్రకటించాలని, పీఆర్సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. వేణు, ఎస్.సంపత్ మాట్లాడుతూ.. బడిబాటలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, స్కావెంజర్లను నియమించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జమ్మికుంట జోన్ కన్వీనర్ ఎ.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ సదానందం, కమిటీ సభ్యులు వెంకట్రాజం, సమ్మిరెడ్డి, శంకర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు కార్మికులు.. వంటకు విద్యార్థులు



గన్నేరువరంలో వంట చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీచర్లు

గన్నేరువరం: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఆటంకం ఏర్పడింది. కొన్ని స్కూళ్లలో విద్యార్థులకు ముందస్తు సమాచారం ఉండటంతో ఇంటి నుంచి టిఫిన్ బాక్స్ తెచ్చుకున్నారు. మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు వంట కార్మికులుగా మారిపోయారు. కాగా గౌరవ వేతనం పెంచాలని, ప్రతినెలా మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలని సమ్మె చేపట్టినట్లు ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు తెలిపారు.

వెలిచాలలో ఇంటింటి సర్వే



సర్వేలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా సోమవారం మరుగుదొడ్ల నిర్వహణ తీరుపై ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఇళ్లల్లోని ఇంకుడు గుంతలు, కిచెన్ గార్డెన్, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణ అంశాలపై వివరాలు సేకరించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో భాస్కర్‌రావు, సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టండి



బోరుబావి వద్ద కాలనీవాసులు

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి ఎస్సీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మూడు నెలలుగా బోరుబావి మరమ్మతులు చేయకపోవడంతో కాలనీవాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్య తీర్చాలని తెలంగాణ నిరుపేదల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె దుర్గా ప్రసాద్ కోరారు.

గుండెపోటుతో ఇటుకబట్టీల వ్యాపారి మృతి



ఖాన్ (ఫైల్)

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ శివారులో ఇటుకబట్టీలు నిర్వహిస్తున్న ఖాన్(65) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఖాన్ కొన్నేళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి వెదిరకు వచ్చి, ఇటుకబట్టీల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం బట్టీల వద్ద పనులు చేస్తుండగా గుండెపోటుకు గురై, అక్కడికక్కడే మృతిచెందాడు.